సాక్షి కామారెడ్డి

బుధవారం, 17, సెప్టెంబర్, 2025



ఇటు యూరియా కొరత..

ఓవైపు యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులు.. మరోవైపు తెగుళ్ల బెడదతో ఆందోళన చెందుతున్నారు.

- 9లో ▸



ఐకేపీ రుణాలతో..

మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని అదనపు కలెక్టర్ చందర్ సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /22.7

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు ప్రజాపాలన దినోత్సవం

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో బుధవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని, కోదండరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని సూచించారు.

'వరిలో తడి పొడి విధానంతో పర్యావరణ పరిరక్షణ'



కామారెడ్డి రూరల్: వరి సాగులో తడి పొడి విధానాన్ని పాటించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అడ్లూర్‌లో పద్మపాణి సొసైటీ, కోర్‌కార్బన్ ఎక్స్ సంస్థల ఆధ్వర్యంలో రైతులకు వరిలో తడి పొడి విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ఈ విధానం వల్ల వరిలో మీథేన్ ఉద్గారాలను తగ్గించవచ్చన్నారు. తద్వారా ఎరువులు సద్వినియోగం అవుతాయని, భూసారం పెరుగుతుందని, పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. నూతన విధానాన్ని పాటిస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా ఎకరానికి రూ. 500 చొప్పున ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీసీఎక్స్ ప్రతినిధులు కార్తీక్‌రావు, నీలేష్, చందు, పాండు, భీష్మం, పద్మపాణి డైరెక్టర్ సత్యనారాయణ్, ఏఈవో దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'సజావుగా పత్తి కొనుగోలు చేయాలి'

కామారెడ్డి క్రైం : జిల్లాలో పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పత్తి విక్రయాల కోసం ప్రభుత్వం కపాస్ కిసాన్ అనే ప్రత్యేక యాప్‌ను తీసుకువస్తోందని తెలిపారు. దాని ద్వారా రైతులు తమ ఇంటి నుంచే పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏ జిన్నింగ్ మిల్లుకు వెళ్లాలి, ఏ సమయంలో వెళ్లాలి అనే విషయాలన్నీ యాప్ ద్వారా రైతులకు తెలుస్తాయన్నారు. యాప్ అమలులోకి రాగానే ప్రచార కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల నమోదు, కౌలు రైతుల వివరాల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

మళ్లీ దంచికొట్టిన వాన



కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు

జిల్లాలో మంగళవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం (మి.మీ.లలో)

ఇసాయిపేట	సదాశివనగర్	రాంలక్ష్మణ్‌పల్లి	హసన్‌పల్లి	తాడ్వాయి	పాతరాజంపేట	లింగంపేట	కలెక్టరేట్	భిక్కనూరు	నాగిరెడ్డిపేట
49.8	48.5	42.0	34.3	25.3	24.0	21.0	15.0	14.0	07.8

- ఇసాయిపేటలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- పొంగిపొర్లుతున్న వాగులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మాచారెడ్డి, పాల్వంచ, కామారెడ్డి, సదాశివనగర్, గాంధారి, నాగిరెడ్డిపేట, లింగంపేట, నిజాంసాగర్, తాడ్వాయి తదితర మండలాల్లో భారీ వాన పడింది. వర్షంతో కామారెడ్డి పట్టణంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో వాగులు పొంగి ప్రవహించాయి. కాగా వాగులు పొంగుతుండడంతో మరోసారి పంటలు నీటమునుగుతున్నాయి. గత నెలాఖరులో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేస్తుండగా.. మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో పనులకు ఆటంకం కలుగుతోంది. ఇప్పటికీ కొన్ని రూట్లలో వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. మరిన్ని వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఉంది.

మునిగిన పంటలు

నాగిరెడ్డిపేట : మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మళ్లీ పంటలు నీట మునుగుతున్నాయి. ఎగువన ఉన్న సింగూర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరదనీటితోపాటు పోచారం ప్రాజెక్టు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తున్న నీటితో నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాల, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, లింగంపల్లికలాన్, తాండూర్, వెంకంపల్లి, మాటూర్ తదితర గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. గత నెలాఖరున కురిసిన భారీవర్షాల కారణంగా మండలంలోని మంజీర పరీవాహక ప్రాంతంలో పంటలు నీటమునిగి భారీ నష్టం వాటిల్లింది. మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో మిగిలిన పంట సైతం దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వెంకంపల్లి శివారులో ముంపునకు గురైన పంటలు

26,214 ఎకరాల్లో పంట నష్టం

- అంచనాలు సిద్ధం చేసిన వ్యవసాయ అధికారులు
- పరిహారం అందించాలని కోరుతున్న రైతులు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఇటీవల బీభత్సం సృష్టించిన భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన పంటల లెక్క తేలింది. దాదాపు పక్షం రోజుల పాటు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి మొత్తం 26,214 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు నిర్ధారించారు. వాటిలో ముఖ్యంగా వరి, సోయాబీన్ పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది.

వరి, సోయాబీన్ పంటలకు భారీ నష్టం..

భారీ వరదలు ముంచెత్తడంతో పంటలు నీట మునిగాయి. ఇందులో ఎక్కువగా సోయా, వరి పంటలకు నష్టం వాటిల్లింది. 14,547 ఎకరాల్లో వరి, 8,889 ఎకరాల్లో సోయాబీన్ పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే 1,387 ఎకరాల్లో పత్తి, 1,388 ఎకరాల్లో మక్క, 160 ఎకరాల్లో పప్పు దినుసుల పంటలు, 112 ఎకరాల్లో ఉద్యాన పంటలు, 35 ఎకరాల్లో చెరుకు పంటకు నష్టం వాటిల్లిందని తేల్చారు. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో వ్యవసాయ క్షేత్రాలు నీట మునిగాయి. ఇసుక మేటలు వేయడంతో మరింత నష్టం జరిగింది. నష్టం తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్షేత్ర స్థాయిలో పర్యటించి అంచనాలు సిద్ధం చేయడానికి దాదాపు 15 రోజుల వరకు పట్టింది.

అత్యధికంగా నాగిరెడ్డిపేట మండలంలో..

భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో 26,214 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. బాన్సువాడ డివిజన్ పరిధిలో 11,474 ఎకరాల్లో, ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో 7,732 ఎకరాల్లో, కామారెడ్డి డివిజన్ పరిధిలో 7,008 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు నివేదించారు. జిల్లాలో అత్యధికంగా నాగిరెడ్డిపేట్ మండలంలో 2,828 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దోంగ్లీ మండలంలో 2,816 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. గతేడాది జరిగిన పంట నష్టానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టపరిహారం కింద రైతుల ఖాతాల్లో జమ చేసింది. గతంలోకంటే ఈసారి నష్టం తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎక్కువ పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో మండలాలవారీగా జరిగిన పంట నష్టం వివరాలు..

మండలం	ఎకరాలు				
		కామారెడ్డి	1,247	మహ్మద్‌నగర్	515
నాగిరెడ్డిపేట్	2,828	గాంధారి	1,031	రామారెడ్డి	440
డోంగ్లీ	2,816	లింగంపేట్	1,021	సదాశివనగర్	312
బిచ్కుంద	2,544	పాల్వంచ	884	మాచారెడ్డి	250
మద్నూర్	2,523	నిజాంసాగర్	803	బాన్సువాడ	194
రాజంపేట్	1,585	బీబీపేట	783	బీర్కూర్	128
భిక్కనూరు	1,528	దోమకొండ	731	నస్రుల్లాబాద్	88
తాడ్వాయి	1,412	ఎల్లారెడ్డి	688	పెద్దకొడప్‌గల్	85
జుక్కల్	1,258	పిట్లం	520		



నిజాంసాగర్‌నుంచి విడుదలవుతున్న వరద నీరు

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ వరద

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 55,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. సింగూరు ప్రాజెక్టుతో పాటు హల్దీవాగు, ఘనపురం ఆనకట్ట, పోచారం ప్రాజెక్టుల ద్వారా వరద కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు 9 గేట్ల ఎత్తి 61,542 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.

సింగూరులోకి..

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు ఆరు గేట్లను ఎత్తి 50 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

ప్రాజెక్టు సమాచారం..

మంజీర నది వైపు వెళ్లవద్దు

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తుండడం, ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నందున మంజీర నదీతీరం వైపు ఎవరూ వెళ్లవద్దని నీటిపారుదల శాఖ అధికారులు సూచించారు. ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల ఎప్పటి కప్పుడు పెంచుతుండటంతో నదిలో ప్రవాహ ఉధృతి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మంజీరా నది తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పోచారం ప్రాజెక్టులోకి..

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టుకు మంగళవారం వరద తాకిడి పెరిగింది. 3,854 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. అంతే మొత్తంలో నీరు పోచారం ప్రాజెక్టు అలుగుపై నుంచి పొంగిపొర్లుతూ మంజీర నదిలోకి చేరుతోంది.



అలుగు పారుతున్న పోచారం ప్రాజెక్టు

నేటినుంచి 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్'



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా అధికారులు

- మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యం
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్'ను రూపొందించిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈ కార్యక్రమం బుధవారం దేశవ్యాప్తంగా ప్రారంభం అవుతోందన్నారు. కార్యక్రమం అమలుపై మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, తద్వారా కుటుంబాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్ చందర్ నాయక్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి సతీష్ యాదవ్, యువజన సంక్షేమ అధికారి వెంకటేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జాతీయ స్థాయిలో రాణించాలి'



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : విద్యార్థులు జాతీయ స్థాయి యోగా పోటీల్లోనూ రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఇటీవల నిర్మల్ పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. పలు విభాగాల్లో కలిపి 12 బంగారు, 3 రజత, 4 కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తొలిసారి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. వీరు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిశారు. క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌గౌడ్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి రఘుకుమార్ పాల్గొన్నారు.

వీరులకు వందనం

- నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం
- క్రియాశీలక పాత్ర పోషించిన జిల్లావాసులు
- 'విముక్తి' పోరులో అమరులెందరో..
- నేడు తెలంగాణ స్వేచ్ఛా వాయువులు పీల్చిన రోజు



1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుంచి విముక్తమై మిగతా భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నా.. తెలంగాణ ప్రజలు మాత్రం నిరంకుశ నిజాం పాలనలోనే మగ్గిపోవాల్సి వచ్చింది. స్వేచ్ఛ కోసం మరికొంతకాలం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 13 నెలలపాటు ఈ ప్రాంత బిడ్డలు తిరగబడ్డారు. నిజాం సేనల చేతిలో క్రూరమైన చిత్రహింసలను ఎదుర్కొన్నారు. చివరికి 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు విముక్తి సాధించారు. నిజాం విముక్తి పోరుకు 77 ఏళ్లు నిండిన సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా.. హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం నిరంకుశ పాలన కిందే ఉండిపోయింది. దీంతో స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు ఈ ప్రాంత ప్రజలు పోరాటాన్ని కొనసాగించారు. అటు ఆర్యసమాజ్ ద్వారా ఒక ఉద్యమం, ఇటు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం మరోవైపు కొనసాగాయి. ఇరువురి లక్ష్యం తెలంగాణ విముక్తి. ఈ పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను అర్పించారు. మరెందరో జైలు జీవితం గడిపారు. నిజాం పోలీసులు ఎంతో మందిని చిత్రహింసలకు గురిచేశారు. అప్పటి యువత ప్రాణాలకు ఒడ్డి నిజాంకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. వారిలో చాలా మంది మరణించారు. కామారెడ్డి ప్రాంతానికి చెందిన చాకలి సాయన్న, రాజారెడ్డి, లక్ష్మారెడ్డి, గంగారెడ్డి, ఆగమయ్య, గుండారెడ్డి, రాజీరయ్య, వెంకయ్య, మల్లయ్య, రాంచంద్రం, నారాయణరెడ్డి, భూమారెడ్డి, గోపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, బాదల్‌చంద్, గంగయ్య, బాల్‌లింగం, కిషన్‌రావ్ తదితరులు నిజాం పాలకులతో పోరులో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జిల్లాలోని దోమకొండ, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద ప్రాంతాలకు చెందిన వందలాది మంది నిజాం పాలనపై జరిగిన అన్ని పోరాటాల్లో భాగమయ్యారు. తర్వాతి కాలంలో కొందరిని ప్రభుత్వాలు స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాయి.

'ఫణిహారం' కీలక పాత్ర...

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరులో ఫణిహారం రంగాచారిది వీరోచిత పోరాటం. పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మణాచారి కుమారుడైన రంగాచారి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. చిత్రలేఖనంలో మంచి ప్రావీణ్యం ఉన్న రంగాచారితో పాటు ఆయన మిత్రుడు విఠల్‌రావ్‌లను అప్పటి ఉపాధ్యాయుడు బషీరొద్దీన్ హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చేర్పించాడు. రంగాచారి చదువుకుంటున్న సమయంలో హైదరాబాద్ సంస్థానంలో రజాకార్ల కార్యకలాపాలు జోరుగా సాగేవి. వారికి దీటుగా ఆర్యసమాజ్ ఉద్యమం బలంగా వ్యాప్తిచెందడంతో రంగాచారి, విఠల్‌రావ్‌లు అటువైపు నడిచారు. ఆర్యసమాజ్ హిందువులకే ప్రాధాన్యం ఇవ్వడంతో వాళ్లిద్దరు హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులైన జవాద్‌రజ్వీ, డాక్టర్ పరంజపేలతో సంబంధం పెట్టుకుని విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పనిచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల దోపిడీ, నిర్బంధ పన్నుల వసూళ్లు, లెవీ వసూళ్లపై రంగాచారి ఎన్నో చిత్రాలు గీశాడు. ఆయన గీసిన చిత్రాలు ఇప్పటికీ హైదరాబాద్‌లోని ముగ్దుంభవన్‌లో ఉన్నాయి.

1946 లో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురికావడంతో పార్టీ కార్యదర్శిగా కేఎల్ మహేంద్ర ఎన్నికై రహస్య స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ సమయంలో రంగాచారి తన సహచరులు బాసిత్, షానూర్‌అలీ, నర్సింగ్‌రావ్ మరికొందరితో కలిసి ఆయుధాలు సేకరించే కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. సేకరించిన ఆయుధాలను ఉద్యమ ప్రాంతాలకు పంపించేవారు. అంతేగాకుండా ఉస్మానియా ఆస్పత్రి నుంచి రాజ్‌బహదూర్‌గౌడ్, ఎస్‌పీకే ప్రసాద్‌లను పోలీసు కస్టడీల నుంచి తప్పించడంలో రంగాచారి ప్రముఖ పాత్ర పోషించారు. కమ్యూనిస్టు నేత చెన్నమనేని రాజేశ్వర్‌రావ్‌ను కూడా ఆయన కాపాడారు. ఈ క్రమంలో నల్గొండకు చెందిన రామచంద్రారెడ్డి ఎలుగుబంటి దాడిలో గాయపడగా చికిత్స కోసం చిలుకలగూడలో రంగాచారి నిర్వహిస్తున్న రహస్య స్థావరానికి తీసుకువచ్చారు. అయితే రంగాచారి ఆయనను వెంటనే ఇతర ప్రాంతానికి తరలించారు. ఎడ్లబండిపై పడ్డ రక్తపు మరకల ఆధారంగా పోలీసులు రామచంద్రారెడ్డిని తీసుకువచ్చిన బండి యజమానిని పట్టుకుని చిత్రహింసలకు గురిచేయడంతో రహస్య స్థావరం వివరాలు తెలిశాయి. నిజాం పోలీసులు అక్కడికి చేరుకుని రంగాచారి, వెదిరె రాజిరెడ్డిలను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలులో బంధించి చిత్రహింసలకు గురిచేశారు. రంగాచారి నుంచి రహస్యాలను రాబట్టలేని పోలీసులు.. వరంగల్ జిల్లాలోని మామునూర్ కాన్సన్‌ట్రేషన్ క్యాంపునకు తరలించి అక్కడ చిత్రహింసలకు గురిచేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. రంగాచారి త్యాగాలను స్మరించుకునేందుకుగాను కామారెడ్డి పట్టణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఏటా తెలంగాణ విముక్తి రోజైన సెప్టెంబర్ 17న రంగాచారి విగ్రహం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వీరులను స్మరించుకుంటున్నారు.



ఫణిహారం రంగాచారి



నారాయణ రెడ్డి



వకీల్ భూమారెడ్డి



గోపాల్ రెడ్డి



విఠల్ రెడ్డి

క్లుప్తంగా

యూరియా కొరతను తీర్చాలని వినతి



దోమకొండ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు సరిపడా యూరియాను తెప్పించాలని మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్‌లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించామన్నారు. షబ్బీర్‌అలీ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు వారు వివరించారు. అలాగే 20 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిన రైతులకు నష్టపరిహారం అందించే విషయమై చర్చించినట్లు తెలిపారు.

సహకార నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: తెలంగాణ సహకార నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు మంగళవారం జరిగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మహిళా కార్యదర్శి రాజకుమారి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డిల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా జి.నర్సింలు, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా పి.కరుణాకర్‌రెడ్డి, అబ్దుల్ అలీం, డి.సాయినాథ్, కార్యదర్శిగా సయ్యద్ మసియోద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా సీహెచ్ రాధిక, డి.విశ్వనాథ్, కోశాధికారిగా సృజన్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.సురేష్, ప్రచార కార్యదర్శిగా విష్ణు, కార్యవర్గ సభ్యులుగా మమత, విజయలక్ష్మి, రమాదేవిలు ఎన్నికయ్యారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: పట్టణంలో ఇటీవల దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రవీణ్ కుమార్ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. ద్వితీయ శ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి చంద్రశేఖర్ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

దెబ్బతిన్న బంజర- లింగంపల్లికలాన్ రోడ్డు

- ప్రారంభంకాని రోడ్డు మరమ్మతు పనులు
- ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు



లింగంపల్లికలాన్ రోడ్డుపై మరోచోట కూలిపోయిన సైడ్‌వాల్



వరదలతో ఒకచోట దెబ్బతిన్న బంజర-లింగంపల్లికలాన్ రోడ్డు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నాగిరెడ్డిపేట మండలంలోని బంజర నుంచి లింగంపల్లికలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డు రెండు చోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. బంజర-లింగంపల్లికలాన్ రోడ్డుకు ఒకవైపు పోచారం ప్రధాన కాలువ ఉండగా మరోవైపు పంటపొలాలున్నాయి. రోడ్డుకు ఒకవైపు ఉన్న పోచారం ప్రధాన కాలువ కింద నుంచి అక్కడక్కడా అండర్ టన్నెల్స్(నేల మోరీలు) ఉన్నాయి. అండర్ టన్నెల్స్ నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహించడంతో రెండుచోట్ల మట్టి కొట్టుకుపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. అండర్ టన్నెల్స్ వద్ద మట్టి కోతకు గురై సైడ్‌వాల్స్ కూలిపోయి ఏర్పడిన భారీగుంతలతో ప్రయాణికులు భయపడుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు రోజురోజుకు మరింత ధ్వంసమవుతోంది.

ఈ రోడ్డుకు ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు పనులు ప్రారంభం కాలేదు. ఈ రోడ్డుపై గతయేడు వర్షాలతో ఒక చోట అండర్‌టన్నెల్ వద్ద దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టేందుకు నీటిపారుదలశాఖ ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాని మరమ్మతు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోగా ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా రోడ్డు మరింత దెబ్బతిన్నది. ఈ రోడ్డుపై రాకపోకలు సజావుగా సాగేలా అధికారులు చర్యలు చేపడితే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

బంజర-లింగంపల్లికలాన్ రోడ్డు గతయేడు వర్షాలతో ఒక అండర్ టన్నెల్ వద్ద దెబ్బతిన్నది. గత నెలాఖరున కురిసిన భారీవర్షాలకు మరో అండర్‌టన్నెల్ వద్ద రోడ్డు దెబ్బతిన్నది. కాగా రోడ్డు ధ్వంసమైన అండర్‌టన్నెల్స్ వద్ద శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీఈఈ, ఇరిగేషన్ శాఖ, ఎల్లారెడ్డి

గాంధారి మండలంలో కలెక్టర్ పర్యటన



గుర్జాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

గాంధారి: మండల కేంద్రంతో పాటు గుర్జాల్, వండ్రికల్ గ్రామాలను మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో 65 ఇళ్లు కూలిపోయాయి. బాధితులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సహాయ కిట్స్‌ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో జిల్లాలో సుమారు 600 ఇళ్లు కూలాయన్నారు. బాధితులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పలు వస్తువులతో కూడిన సహాయ కిట్స్‌ను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మురళి, తహసీల్దార్ రేణుకా చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ అధ్యక్షుడు రాజన్న, ప్రతినిధులు సంజీవరెడ్డి, రఘుకుమార్, కృష్ణ మానేటి, నాగేశ్వర్‌రావు, అన్నారెడ్డి, గంగయ్య, కాశెట్టి కిషన్, మాత్యాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

గుర్జాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో వంటశాలను, వంటలను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నోటు బుక్కులను అందించారు. అనంతరం గుర్జాల్-వండ్రికల్ రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు.

కిలోమీటర్‌కు రూ.500 చార్జి వసూలు



గొడుగుమర్రికి వెళ్లే కంకర రోడ్డు



బురదమయంగా గొడుగుమర్రి తండా జీపీ రోడ్డు

- గొడుగుమర్రి తండాలో దెబ్బతిన్న రోడ్లు
- రోడ్లు బాగాలేకపోవడంతో ఆ గ్రామం వైపు వెళ్లడానికి జంకుతున్న ఆటోవాలాలు
- ఎక్కువ చార్జి చేస్తున్న వైనం

రామారెడ్డి: కిలోమీటరు దూరానికి ఆటో చార్జి మహా అయితే రూ.వందనో లేదంటే ఇంకా ఎక్కువలో ఎక్కువగా రూ.200 ఆటో చార్జి తీసుకుంటారు. కానీ అన్నారం నుంచి గొడుగుమర్రి జీపీకి అంగన్‌వాడీ స్కూల్‌కి సంబంధించిన వస్తువులు, అలాగే ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన బియ్యం ఇతర వస్తువులను ఆటోలో తీసుకెళ్లాలంటే రూ.500 చెల్లించాల్సిందే. అంత డబ్బులు చెల్లించినా ఆటోలు గొడుగుమర్రి తండాకు రావడానికి నిరాకరిస్తున్నారు. మట్టి రోడ్డుతో ఆటోలు చెడిపోతున్నాయని చెబుతున్నారు. కిలోమీటర్ దూరం నరకం చూపించే రోడ్డుతో విసిగిపోయిన ఆటో కార్మికులు అటువైపు వెళ్లడం లేదు. ఇటీవల గొడుగుమర్రి తండాకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నిధులు రాకపోవడంతో కంకర పోసి మధ్యలోనే వదిలేశారు. కొద్ది దూరం కంకర ఆ తర్వాత బురదలో ప్రయాణాలకు ఇబ్బంది కావడంతో అటువైపే ఆటోలు రావడం లేదు. స్కూల్, అంగన్‌వాడీ స్కూల్‌కు చెందిన బియ్యాన్ని ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులే బైకులపై తరలిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే బైకులపై సైతం ఈ రోడ్డుపై ప్రయాణం వీలు కాదు. దీంతో అన్నారం గ్రామంలో బైకులు పెట్టి ఉపాధ్యాయులు నడుచుకుంటూ గొడుగుమర్రి తండాకు వెళ్లి వస్తుంటారు.

సహకార సంఘం వద్ద రైతుల ఆందోళన



రాంపూర్ సహకార సంఘం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్‌రావు

పిట్లం(జుక్కల్): రాంపూర్ సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. సహకార సంఘానికి 440 బ్యాగుల యూరియా వచ్చింది. మంగళవారం యూరియాను సరఫరా చేసే సమయంలో రైతులు ఆందోళనకు దిగారు. సహకార సంఘం పరిధిలో గౌరారం, గౌరారం తండా, బండపల్లి, మద్దెల చెరువు, బొల్లక్‌పల్లి తదితర గ్రామాలు ఉంటాయి. ఆ గ్రామాలకు సంబంధించిన రైతులు యూరియా కోసం పాస్‌బుక్‌లను పట్టుకొని సహకార సంఘం ముందు క్యూలో నిలబడ్డారు. కేవలం 440 సంచుల యూరియా రావడంతో, టోకెన్ల ప్రకారం ఒక పాస్ బుక్‌కు ఒక యూరియా బస్తాను సహకార సంఘం సిబ్బంది సరఫరా చేశారు. వచ్చిన యూరియా కొద్ది సమయంలోనే అయిపోవడంతో, మిగిలిన రైతులు ఆందోళనకు దిగారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని సహకార సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పిట్లం ఎస్సై వెంకటరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించారు. దీంతో రైతులు వెనుతిరిగి వెళ్లారు.

ఉపాధి హామీ ద్వారా ఇసుకమేటలను తొలగిస్తాం



ఇసుక మేటలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బీబీపేట: భారీ వర్షాల కారణంగా పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలను ఉపాధి హామీ పథకం ద్వారా త్వరలోనే తొలగిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇసుక మేటలు వేసిన వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో మొత్తం 40 మంది రైతులకు సంబంధించిన 15 ఎకరాల్లో ఇసుక మేటలు తొలగిస్తామన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్, కార్యదర్శి రమేష్ ఉన్నారు.

ఏఐటీయూసీ మహాసభను విజయవంతం చేయాలి



పిట్లం(జుక్కల్): నిజామాబాద్ జిల్లాలో ఈనెల 27న జరగనున్న మార్కెట్ హమాలీ, దడ్వాయి స్వీపర్ల ఏఐటీయూసీ రాష్ట్ర రెండో మహాసభలో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుర్రెం బాల్ రాజ్ కోరారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రం తెచ్చిన 3 నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ, సభ్యులు పాల్గొన్నారు.

బోర్లంక్యాంపు తండాలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ



బాన్సువాడ రూరల్: బోర్లంక్యాంపు తండాలో ఈ నెల 28 నుంచి 3 రోజుల పాటు జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వారు గ్రామస్తులతో కలిసి టోర్నమెంట్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఎంట్రీ ఫీజు రూ.800 చెల్లించి ఈనెల 25లోగా జట్టు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో విజేతలకు రూ.20వేలు, రన్నరప్‌కు రూ.10వేల నగదుతో పాటు ట్రోఫీలు అందజేస్తామన్నారు. టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ధారవత్ రవి, తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 77026 27567, 99085 50202కు సంప్రదించాలన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో భారం తగ్గింది



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మద్నూర్(జుక్కల్): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలపై అదనపు భారం తగ్గిందని బీజేపీ డోంగ్లీ మండల అధ్యక్షుడు ధనంజయ పాటిల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన సందర్భంగా బీజేపీ నాయకులు మంగళవారం డోంగ్లీ మండల కేంద్రంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలతో అభిషేకం నిర్వహించి మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారులకు మంచి లాభదాయకమని అన్నారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉంటే మన దేశం బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందన్నారు. ప్రజల శ్రేయస్సు కోరే ప్రధానమంత్రి ఉండటం ఆనందంగా ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి సచిన్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పటేల్, రేవాన్, గంగాధర్, రామాగౌడ్, శంకర్, మోహన్, ఆశోక్, దత్తు, భీంరావ్, నాగేష్ తదితరులున్నారు.

ఆయిల్‌పాం సాగుతో రైతులకు ప్రయోజనం



దోమకొండ: ఆయిల్‌పాం సాగుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ ప్రతినిధి నసీంఅలీ అన్నారు. మంగళవారం అంబారీపేటలో ఆయిల్‌పామ్ సాగును పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోటలు జనవరి నెలలో క్రాప్ కటింగ్ వస్తాయన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి క్రాప్ కటింగ్ ఉంటుందని, కంపెనీకి పంపడం కోసం కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంపెనీ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, క్లస్టర్ మేనేజర్ హిమకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయండి

- ఫొటోగ్రాఫర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



రామారెడ్డి: హైదరాబాద్ ఈ నెల 19న జరిగే ఫొటో ఎక్స్‌పోకు ఫొటోగ్రాఫర్లు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. రామారెడ్డి మండలంలో ఫొటోగ్రాఫర్లు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై లావణ్యతో కలిసి వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్, మండల అధ్యక్షుడు మధు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును తాడ్వాయి పోలీసులు అందజేశారు. లింగంపేట్ మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన సాతెల్లి నరేష్ అనే వ్యక్తి తన పర్సును ఈనెల 15న తాడ్వాయి మండలంలోని నందివాడలో పోగొట్టుకున్నారు. ఈ విషయమై తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో అతడు ఫిర్యాదు చేశాడు. పర్సు ఓ వ్యక్తికి దొరకగా, అతడు తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో అందజేశాడన్నారు. అనంతరం పోలీసులు పర్సును పోగొట్టుకున్న వ్యక్తికి అందజేశారు. పర్సులో రూ. 200 నగదు, విలువైన కార్డులు ఉన్నాయన్నారు.

ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో పాము కలకలం



బాన్సువాడ: బాన్సువాడ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో పాము కలకలం రేపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం బాన్సువాడ బ్లడ్ బ్యాంకు సిబ్బంది ఎల్లారెడ్డిలో రక్త దాన శిబిరం ఉండడంతో అక్కడి వెళ్లారు. శిబిరంలో సేకరించిన రక్తాన్ని ఫ్రిజ్‌లో పెట్టేందుకు సిబ్బంది సాయంత్రం వచ్చారు. సిబ్బంది వచ్చి బ్లడ్ బ్యాంకు గది తలుపులు తీసి చూడగా గదిలో శబ్దం రావడాన్ని గమనించారు. గదిలో ఓ మూలన పెద్ద జెర్రిపోతు పాము కంట పడింది. దీంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఆస్పత్రి సిబ్బంది వచ్చి పామును చంపేసారు. నెల రోజుల్లో బ్లడ్ బ్యాంకులో రెండు సార్లు పాములు ప్రత్యక్షం కావడంతో సిబ్బంది భయంతో విధులు నిర్వహిస్తున్నారు. బ్లడ్ బ్యాంకు చుట్టూ పొదలు పెరిగిపోవడంతో అందులో నుంచే పాములు వస్తున్నట్లు సిబ్బంది అంటున్నారు. వెంటనే బ్లడ్ బ్యాంకు పరిసరాలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

రూ.6 వేల పింఛన్ ఇవ్వాలి



పిట్లం(జుక్కల్): దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని కోరుతూ దివ్యాంగులు పిట్లం తహసీల్ కార్యాలయం వద్ద మంగళవారం సీనియర్ అసిస్టెంట్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో సూచించిన విధంగా దివ్యాంగులకు రూ.4 వేల నుంచి 6 వేలకు పెంచి పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 22 నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగులు లోక శ్రీనివాస్, వెంకట సాయి, రారాజు, శ్రీనివాస్, బ్రహ్మం, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోని గుట్టమీద గల శివ భక్త మార్కండేయ ఆలయంలో చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆలయంలోని హుండీని సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగుడు ఆలయ ఆవరణలో పగులగొట్టి డబ్బులు దొంగిలించినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యుడు ఆశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే మండల కేంద్రంలో ఇంటి ముందర నిలిపిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైకు చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



జక్రాన్‌పల్లి: బైక్ చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మాలిక్ రెహమాన్ తెలిపారు. జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని గాంధీనగర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, వారిని పట్టుకుని విచారించారు. వారి వద్దనున్న బైక్‌ను గత నెల 18న జక్రాన్‌పల్లి బస్టాండ్ వద్ద నుంచి చోరీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నాగమడుగులో ఒకరి గల్లంతు



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టుకు దిగువన ఉన్న నాగమడుగు లోలెవల్ వంతెన వద్ద వరద నీటిలో ఒకరు గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామానికి చెందిన చాకలి ప్రవీణ్ (30) మంగళవారం అచ్చంపేట గ్రామంలోని బంధువుల వద్దకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా నాగమడుగు వద్ద వరద నీరు ఉధృతంగా ఉండటంతో ఈత కొట్టాడు. దీంతో అతడు నీటమునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు వెంటనే అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. వరద నీటిలో రాత్రి వరకు గాలించారు. అయినా అతడి ఆచూకీ లభించలేదు.

అల్ప్రాజోలం పట్టివేత

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం గ్రామంలో 600 గ్రాములు నిషేధిత అల్ప్రాజోలంను నార్కోటిక్ అధికారులు పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్ మహ్మద్ ఆరీఫ్ మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో గుండారం కల్లు బట్టిపై దాడి చేసి ఆల్ప్రాజోలంను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులైన అశోక్, రమేశ్ గౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

దంపతుల దాడిలో ఒకరికి గాయాలు

- చికిత్స పొందుతూ మృతి

ఖలీల్‌వాడి: దంపతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని దొడ్డికొమరయ్య కాలనీకి చెందిన షకీల్(45) శనివారం మద్యం తాగి ఇంటి పక్కన ఉండే దంపతులు(నాగు-సరస్వతి)తో గొడవపడ్డాడు. దీంతో మరుసటి రోజు ఉదయం దంపతులు షకీల్ ఇంటికి వెళ్లి గొడవపడ్డారు. ఈక్రమంలో షకీల్ తలకు బలమైన గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి, దంపతులను అదుపులోకి తీసుకున్నామని ఆరో టౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



పురుషోత్తం (ఫైల్)



మోర్తాడ్‌లో డివైడర్‌కు ఢీకొన్న కారు

మోర్తాడ్(బాల్కొండ): నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల్ జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెట్‌పల్లికి చెందిన తాటికొండ పురుషోత్తం(59) సోమవారం కారులో వ్యక్తిగత పనుల నిమిత్తం నిర్మల్‌కు వెళ్లాడు. మంగళవారం వేకువజామున తిరిగి మెట్‌పల్లికి అదే కారులో బయలుదేరారు. మోర్తాడ్ వద్ద కారు డ్రైవర్ శేఖర్ హైవేపై ఉన్న సెంట్రల్ లైటింగ్ డివైడర్‌ను గమనించకపోవడంతో వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో డ్రైవర్ పక్కన కూర్చున్న పురుషోత్తంకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. గాయాలైన డ్రైవర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. పురుషోత్తం భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: నగరంలోని బస్‌డిపో-1 ప్రహరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఈనెల 14న ఉదయం సదరు వ్యక్తి అపస్మారకస్థితిలో ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే అతడిని చికిత్స నిమ్మిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కానీ వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని, అతడు బూడిద రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించాడని పోలీసులు తెలిపారు. మృతుడు భిక్షాటన చేసుకునే వ్యక్తిగా కనపడుతున్నట్లు చెప్పారు. ఎవరికైనా అతడి వివరాలు తెలిస్తే వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పెద్దమల్లారెడ్డిలో యువకుడి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఎల్క తిరుపతి (20) గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. గతంలో అమ్మాయిలను వేధించిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి అతడు డబ్బులు కావాలని తల్లి రామవ్వపై ఒత్తిడి చేశాడు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో, అతడు ఇంటికి వెళ్తున్నానని చెప్పి దూలానికి ఉరి వేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఉరి వేసుకున్న కొడుకును చూసి తల్లి రోదించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ అంజయ్య ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన సిద్దిగారి యాదగిరి ఇటీవల నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చెయ్యి కోసుకొని తమతో అనుచితంగా ప్రవర్తించడంతోపాటు తమ విధులకు ఆటంకం కలిగించాడని ఎస్సై తెలిపారు. అలాగే మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు గంగారాజు ఇటీవల మద్యం తాగి తన ఇంటిముందర విద్యుత్ స్తంభం లేదని చెబుతూ సెల్‌టవర్ ఎక్కి డయల్ 100కు కాల్‌చేస్తూ, పోలీసులను దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించాడన్నారు. దీంతో యాదగిరి, గంగారాజుపై కేసులు నమోదుచేసి అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

రోడ్డుపై నిలిచిన వాహనం



మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ శివారులో మంగళవారం ఓ భారీ ట్రక్ టైర్ పంక్చర్ కావడంతో రోడ్డుపై వాహనం నిలిచిపోయింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు గంటపాటు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న మాచారెడ్డి పోలీసులు ప్రొక్లెయిన్ సహాయంతో ట్రక్‌ను తొలగించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.